సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 11 । జనవరి । 2024



బొబ్బిలి సీటు బీసీలకు ఇచ్చే దమ్ముందా? - 8లో

బీసీలపై ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు బొబ్బిలి ఎమ్మెల్యే సీటు బీసీలకు కేటాయించ గలరా అని ఎమ్మెల్యే శంబంగి ప్రశ్నించారు.



ఈ నెల 12 వరకు క్లెయిమ్‌ల పరిష్కారం - 8లో

ముసాయిదా ఓటరు జాబితాపై అందిన అభ్యంతరాలను 12తేదీ వరకు పరిష్కరిస్తామని జేసీ గోవిందరావు తెలిపారు.



అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

అక్రమంగా మైనింగ్ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని మైన్స్ ఎ.డి (విజిలెన్స్) ఎస్పీకే మల్లేశ్వరరావు హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- జిల్లా పశుసంవర్ధక శాఖ ఎ.డి. శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న పశు సంవర్ధకశాఖ ఎ.డి.శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మేలు జాతి ఆడదూడల ఉత్పత్తి పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని పశుసంవర్ధక శాఖ ఎ.డి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ములగ గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలం కిందట మగదూడలు వ్యవసాయ రంగానికి ఉపయోగపడేవన్నారు. మగదూడల జననం అవసరమయ్యేదన్నారు. ఇప్పుడు యంత్రాలతో వ్యవసాయం చేయడం వల్ల మగదూడల అవసరం పెద్దగా లేదన్నారు. అందుకే, మగదూడల స్థానంలో పాడి ఉత్పత్తిని పెంచేలా ఆడ దూడల వృద్ధికి కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్లు వేస్తున్నట్టు తెలిపారు. రైతులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పాడి సంపదను వృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మడక కృష్ణవేణి, మడక విశ్వనాథం, డాక్టర్ జగదీష్, డాక్టర్ జయకృష్ణ, గోపాల మిత్ర పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: జిల్లాలో 693 మంది అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరినట్టు ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలంలో ఇద్దరు, కొమరాడ మండలంలో 35 మంది, బలిజిపేట మండలంలో ఇద్దరు, పాచిపెంట మండలంలో 235 మంది, పాలకొండలో 61మంది, కురుపాంలో ఒకరు, సాలూరులో 304 మంది, భామిని మండలంలో 53 మంది విధుల్లో చేరారన్నారు. విధుల్లో చేరని వారికి షోకాజ్ నోటీసులు అందించినట్టు పేర్కొన్నారు.

రూ. 2,869 కోట్ల టర్నోవర్

- ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఆర్ఎం బి.రాఘవేంద్ర

రేగిడి: పార్వతీపురం రీజనల్ పరిధిలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు రూ.2,869 కోట్ల లావాదేవీలు జరుపుతున్నట్టు రీజనల్ మేనేజర్ బి.రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని ఉంగరాడమెట్ట ఏపీజీవీబీ బ్రాంచిను బుధవారం సందర్శించారు. రుణాల మంజూరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రీజనల్ పరిధిలో 57 బ్రాంచిలు ఉన్నాయని, 309 మంది బ్యాంకు మిత్రులు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ సేవలందిస్తున్నామన్నారు. రైతులకు విరివిగా రుణాలు అందజేస్తున్నట్టు వెల్లడించారు. డెయిరీల ఏర్పాటు, ట్రాక్టర్ల కొనుగోలుకు రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రజలు గుర్తింపులేని ప్రైవేట్ చిట్ ఫండ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. ఖాతాదారులు తమ బ్యాంకుల్లో రూ.12 కోట్ల మేర డిపాజిట్లు చేశారన్నారు. రైతులకు రూ.25 కోట్లు మేర వ్యవసాయ రుణాలు అందజేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ టి.సోమేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ పొన్నాన ఈశ్వరరావు, క్యాషియర్ పాయల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మె విరమణ



విధుల్లో చేరుతామని డీఈఓకు లిఖిత పూర్వక లేఖను అందజేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

పార్వతీపురంటౌన్: సమగ్ర శిక్ష సిబ్బంది సమ్మె విరమించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించడం సంతోషదాయకమని, గురువారం నుంచి విధుల్లో చేరతామని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఎంఆర్‌సీ)లు 18 మంది, క్లస్టర్ రిసోర్సు పర్సన్లు 105 మంది, సైట్ ఇంజినీర్లు ఆరుగురు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు 14 మంది, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 83 మంది, మెసెంజర్లు 14మంది, ఐఈఆర్‌పీఎస్‌లు 30 మంది, ఆఫీస్ సబార్డినేటర్లు ఇద్దరు, అసిస్టెంట్ ఏఎల్ఎస్ఓ ఒకరు సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్టు డీఈఓకు తెలిపారు.

చిరు వ్యాపారులకు
ఆర్థిక తోడు



- వ్యాపార పెట్టుబడికి 'జగనన్నతోడు' కింద సాయం
- నేడు 8వ విడత నిధుల విడుదల
- ఏడు విడతల్లో 47,532 మందికి లబ్ధి
- ఇప్పటివరకు రూ.47.53 కోట్ల వడ్డీలేని రుణాలు
- ఈ ఏడాది 7,343 మందికి రూ.7.76 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- వ్యాపార కుటుంబాలకు ముందే వచ్చిన సంక్రాంతి



చిరు వ్యాపారులు

పార్వతీపురం టౌన్:

చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తికారులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా అండగా నిలుస్తోంది. వ్యాపార పెట్టుబడిని అందిస్తోంది. వడ్డీలేని రుణాలను ఠంచన్‌గా మంజూరు చేస్తోంది. వీధి వ్యాపారులు, రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో కూరగాయల విక్రయదారులు, టిఫిన్ సెంటర్ల వంటి రోజువారీ వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులతో పాటు సంప్రదాయ వృత్తులు చేసుకుని జీవనం సాగించే లేస్‌వర్కర్లు, కళంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, లెదర్ వస్తువుల తయారీ, బొబ్బిలి వీణ, బ్రాస్ వంటి పనులు చేసే వారికి రూ.10వేలు చొప్పున వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తోంది. వ్యాపారుల తరపున బ్యాంకులకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తోంది. జగనన్నతోడు కింద ఇప్పటికే ఏడు విడతలుగా వడ్డీలేని రుణాలు అందించగా, ఎనిమిదో విడత రుణాలను ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోకలెక్టర్ నిషాంత్‌కుమార్, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

రూ.7.76 కోట్ల ఆర్థిక లబ్ధి

జగనన్న తోడు పథకం కింద 8వ విడతలో పార్వతీపురం మన్యం జిల్లాలోని 7,343 మందికి రూ.7.76 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే డీఆర్డీఏ, మెప్మా సంస్థలు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. జగనన్న తోడు పథకంలో ఇప్పటివరకు (ఏడు విడతల్లో) 47, 532 మందికి రూ.47.53 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

9768 మందికి రుణమాఫీ

గతంలో జగనన్న తోడు రుణాలు సకాలంలో చెల్లించిన వారికి బ్యాంకులకు చెల్లించిన రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గతంలో రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన 9,768 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.21.64 లక్షలను ముఖ్యమంత్రి జమ చేయనున్నారు.

జిల్లాలో జగన్న తోడు లబ్ధి ఇలా...

విడత	లబ్ధిదారులు	(చేకూరిన లబ్ధి రూ.కోట్లలో)
మొదటి	6,009	రూ.6.09
రెండవ	5,679	రూ.5.67
మూడవ	7,722	రూ.7.72
నాల్గవ	3,866	రూ.3.86
ఐదవ	10,372	రూ. 10.37
ఆరవ	6,453	రూ.6.45
ఏడవ	7,431	రూ.7.31
ఎనిమిదవ	7,343	రూ. 7.76

చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగం



జగనన్న తోడు పథకం మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. రోజువారీ వడ్డీల బాధ తప్పింది. నేరుగా బ్యాంకు నుంచి రూ.10 వేలు వడ్డీ లేని అప్పు తీసుకుని వ్యాపారంలో పెట్టుబడిని సొంతంగా పెట్టుకోగలుగుతున్నాం. నెలనెలా వచ్చే లాభాన్ని బట్టి వాయిదాను కట్టుకుంటున్నాం. వడ్డీ రాయితీని ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తోంది. ఈ స్థాయిలో చిరువ్యాపారుల గురించి ఏ ప్రభుత్వమూ ఆలోచన చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేనిది.

– సింహాచలం, లబ్ధిదారు, పార్వతీపురం

అర్హులందరికీ అందజేస్తున్నాం



మండల, పట్టణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులకు ప్రభుత్వం జగనన్న తోడు కింద ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. రోజూ పెట్టుబడికి ప్రైవేట్ వ్యక్తులను అప్పుల కోసం ఆశ్రయించాల్సిన అవసరం తప్పింది. చిరు వ్యాపారులు సొంత కాళ్లపై నిలబడేలా పథకం దోహదపడింది. మండల పరిధిలో డీఆర్‌డీఏ, పట్టణ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సహకారాన్ని అందజేస్తున్నాం. జిల్లాలో 8వ విడత 7,343 మందికి రూ.7.76 కోట్లు లబ్ధి చేకూరనుంది.

– పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థికి అత్యున్నత పదవి



ఎం.మురళీమోహన్ రాజు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.మురళీమోహన్‌రాజుకు అత్యున్నత పదవి వరించింది. ఆయన గత కొన్నేళ్లుగా తూర్పు నావికాదళ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నావికాదళంలో విశేష సేవలు అందించడంతో భారత నావికాదళం నుంచి అనేక పదవులు, ప్రశంసలు, రివార్డులు, బిరుదులు, పతకాలు వరించాయి. ప్రస్తుతం తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయంలో రియర్ అడ్మిరల్ అధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయనకు సైనిక పాఠశాల అధికారులు, ఉద్యోగులు, జిల్లా వాసులు అభినందనలు తెలిపారు.

భోగి పండగకు సన్నద్ధం



సంక్రాంతి పండగకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 14న భోగి మంటలు వేసేందుకు అవసరమైన కలప సేకరణలో చిన్నారులు, యువత నిమగ్నమయ్యారు. పొలాల్లో ఉన్న వృథా కలపను ట్రక్కులు, ట్రాలీ రిక్షాలపై తరలిస్తున్నారు. విజయనగరం రామానాయుడు రోడ్డులో కలపను తరలిస్తున్న చిన్నారులను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్యశిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర సెకెండరీ హెల్త్ సంచాలకుడు, జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్

- గ్రామస్థాయిలోనే అత్యున్నత వైద్యసేవలు
- జగనన్న ఆరోగ్య సురక్షను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర సెకెండరీ హెల్త్ సంచాలకుడు, జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. పార్వతీపురం పట్టణం చాకలి బెలగాంలో బుధవారం నిర్వహించిన జేఏఎస్-2 వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జేఏఎస్ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జేఏఎస్‌కు విచ్చేసిన ప్రజలతో మాట్లాడారు. వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులను కేంద్ర డ్రగ్‌స్టోర్ నుంచి గ్రామ వార్డు సచివాలయానికి సరఫరా చేసి, రోగులకు అందజేస్తున్నట్టు వెల్లడించారు. ప్రతీ మంగళ, శుక్రవారాలు మండలాల్లోను, ప్రతీ బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. గ్రామీణ స్థాయిలోనే ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మొదటి దఫాలో జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. కంటివెలుగు కార్యక్రమం ద్వారా కళ్ల తనిఖీలను నిర్వహించి అవసరమైన వారికి కేటరాక్ట్ శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆర్థిక పరిమితిని సైతం రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో అందించిన జేఏఎస్-2 సేవలు	
మండలాలు	15
వైద్యశిబిరాలు	3
మొత్తం ఓపీలు	1288
స్పెషలిస్టుల ఓపీలు	597
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	579
డీఎం	309
హెచ్‌టీఎన్	334
ఏఎన్‌సీ	33
పీఎన్‌సీ	27
అనీమియా	44
ల్యాబ్‌టెస్టులు	952
ఈసీజీ పరీక్షలు	11
కంటి పరీక్షలు	182
రిఫరల్ కేసులు	5

పట్టణంలో మినీ జాబ్ మేళా రేపు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 12న స్థానిక ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని ఆ సంస్థ అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. నాలుగు బహుళజాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను 'స్కిల్‌యూనివర్సెస్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని పూర్తి బయోడేటా, ఆధార్ కార్డు, పాస్‌ఫొటోలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం సెల్: 79956 91295, 79898 26953 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పతకాల పంట

- అంతర కళాశాల పోటీల్లో రాణించిన గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు



క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అసోసియేట్ డీన్, అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లిరూరల్ (గరివిడి): అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి 7వ తేదీవరకు గన్నవరం పశువైద్య కళాశాలలో 12వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. వీటిలో కళాశాలకు చెందిన అబ్దుల్ గౌశియాతపస్సుమ్ టెన్నికాయిట్‌లో, ప్రసన్నసాయి ట్రిపుల్ జంప్‌లో విజేతలుగా నిలిచారు. 200, 400 మీటర్ల పరుగుపందెంలో ఎస్.ప్రణీత తృతీయ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, 3వేల మీటర్ల పరుగుపందెంలో ఎం.భువనేశ్వరి ద్వితీయ, సౌమ్య తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. 5వేల మీటర్ల రన్నింగ్‌లో ఎం.భువనేశ్వరి తృతీయస్థానాన్ని దక్కించుకుంది. లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో వి.సాయిపూజిత (ద్వితీయ), హైజంప్‌లో ఎం.కావ్యశ్రీ (తృతీయ), షాట్‌పుట్‌లో శ్రావణి (తృతీయ), జావెలిన్‌త్రోలో ఎ.నవీన్‌కృష్ణ (తృతీయ), క్యారమ్స్‌లో (ద్వితీయ), చదరంగంలో శ్రీచందన్ (ద్వితీయ) సత్తాచూపారు. టీమ్ ఈవెంట్స్ బాస్కెట్‌బాల్, 400 రిలే రన్నింగ్, టెన్నికాయిట్‌లో మహిళలు, బాల్‌బ్యాడ్మింటన్‌లో పురుషులు ద్వితీయస్థానంలో నిలిచారు. సాంస్కృతిక, సాహిత్య రంగంలో కె.మానససుజాత, లక్ష్మీవైష్ణవి, పి.అంజలి, ఎస్.సృజన, ద్రావణిగౌడ్, నవీన్‌కృష్ణలు ప్రతిభ చూపారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, అధ్యాపక సిబ్బంది బుధవారం అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- అట్టహాసంగా మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం
- క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన క్రీడాకారులు



క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి పోటీలను బుధవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ, ఆడుదాం ఆంధ్రా పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడకారుల ప్రతిభను బయటకు తీసి ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడకారులతో కలిసి కాసేపు బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆద్యంతం అవస్థలే!

- చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగానికి విసుగెత్తిన టీడీపీ శ్రేణులు
- చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనసేన కార్యకర్తలు



బొబ్బిలిలో జనంలేక బోసిపోయిన చంద్రబాబు రా కదలిరా సభ

బొబ్బిలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బొబ్బిలిలో రా కదలిరా పేరుతో బుధవారం నిర్వహించిన సభ ఆద్యంతం అవస్థల నడుమ సాగింది. ఉదయం 11 గంటలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ప్రజలను, కార్యకర్తలను నాయకులు తరలించారు. వారికి టెంట్లు లేకుండా ఆరుబయట కుర్చీలు వేశారు. చంద్రబాబునాయుడు సరిగ్గా మధ్యాహ్నం 1.10 నిమిషాలకు రావడంతో పార్టీ శ్రేణులు విసుగెత్తిపోయారు. కొందరు సభ ప్రారంభానికి ముందే వెళ్లిపోగా, మరికొందరు చంద్రబాబు మాట్లాడుతుండానే ఇంటిబాట పట్టారు. చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగం పార్టీ శ్రేణులను నిరుత్సాహానికి గురిచేసింది. కుర్చీలు ఖాళీగా కనిపిస్తుండడంతో బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పదేపదే ముందుకు రావాలంటూ కార్యకర్తలను కోరినా ఎవరూపట్టించుకోలేదు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిగా రూ.3వేలు ఇస్తా.., అమెరికాలో ఉద్యోగమైనా బొబ్బిలి నుంచే పనిచేసేలా వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కల్పిస్తానంటూ చంద్రబాబు గొప్పలు చెప్పడంపై జనం నవ్వుకున్నారు. మాజీ మంత్రి అశోక్ కుమార్తె వచ్చీరాని తెలుగు పదాలు మాట్లాడినప్పుడు ఇదేం భాషరా అంటూ నిట్టూర్చారు. భోగాపురానికి సంకుసాపన (శంకుస్థాపన) చేశారనీ, విమానాలకు ఏక్సిడెంట్లు అవుతాయనీ, ఆడపిల్లలపై ఆగాయితాలు(అఘాయిత్యాలు) జరుగుతాయని అన్నప్పుడు ప్రజలు అర్థం కాక నవ్వుకున్నారు. పార్వతీపురం టీడీపీ ఇన్‌చార్జి విజయచంద్ర మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెనుక నుంచి ముందుకు నడిపిస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి పడాల అరుణ జనసేన కండువా వేసుకుని పదే పదే టీడీపీ పాటే పాడడంతో ఆ పార్టీ శ్రేణులు అసహనం వ్యక్తంచేశాయి. గ్రోత్ సెంటర్‌లో అభివృద్ధి లేదనీ, పరిశ్రమలు రావడం లేదంటూ బేబీ నాయన విమర్శలు తన అన్న సుజయ్ పనితీరు వైపే చూపాయి. విమర్శించారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే చిరంజీవికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

కాలినడకన అప్పన్న సన్నిధికి..



సింహాచలం దేవస్థానికి కాలినడకన వెళ్తున్న భక్తులు

ధనుర్మాసంలో భాగంగా సింహాచలంలోని వరహాలక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి మూడువేల మంది భక్తులు బుధవారం కాలినడకన వెళ్లారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివెళ్లారు. ఏటా ధనుర్మాసంలో కాలినడకన వెళ్లి సింహాద్రి అప్పన్నస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తెలిపారు. ముందుగా మంగళపాలెం గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వరహాలక్ష్మీనర్సింహస్వామి నామస్మరణ, భజనలతో పాదయాత్రగా బయలుదేరారు. స్వామివారిని దర్శించేందుకు వెళ్లిన వారిలో ఒడిశా రాష్ట్రంతో పాటు అల్లూరిసీతారామరాజు జిల్లా, అరకు, పాడేరు, ఎస్.కోటలోని బొడ్డవర, చిలకలగెడ్డ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు.

– కొత్తవలస

క్లుప్తంగా

ఆర్బీకేలో పోయిన వస్తువులు లభ్యం



లభ్యమైన వస్తువులను పరిశీలిస్తున్న ఏఎస్సై కాశీరావు

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఆర్బీకేలో పోయిన వస్తువులు మళ్లీ ఆర్బీకే వద్దనే లభ్యమైనట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారు జామున ఆర్బీకే తాళాలు విరగ్గొట్టి టీవీ, కంప్యూటర్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుని వెళ్లిపోవడంతో ఏఈఓ నీలా కృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో భయపడిన అకతాయిలు బుధవారం ఉదయం ఆర్బీకే ముందు వస్తువులను ఉంచారు. వస్తువులు దొరికినా దొంగిలించిన వారిపై నిఘా ఉంచుతామని ఏఎస్సై చెప్పారు.

కెరటాం రైసు మిల్లుపై కేసు నమోదు



రైస్‌మిల్లులో వేబ్రిడ్జిపై తూకం వేసి పరిశీలిస్తున్న అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్, అధికారులు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామంలో గల మహేశ్వరి రైస్‌మిల్లుపై తూనికలు కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ లీగల్ కంట్రోలర్ పి.వి. రంగారావు వేబ్రిడ్జి కాటాను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ రవిశంకర్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారులు తాము తెచ్చిన తూనికకు సంబంధించిన గుళ్లతో తూకంవేయగా అన్నీ సక్రమంగానే ఉన్నప్పటికీ వేబ్రిడ్జికి వేసే సీళ్లు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రైలు కిందపడి మృతి చెందిన నవీన్(ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన కోట్ల నవీన్ (25) రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి 10 గంటల తరువాత తన ద్విచక్ర వాహనంపై రైల్వేట్రాక్ వరకు వెళ్లి రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాలపడ్డాడు. బుధవారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న ఆమదాలవలస జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. నవీన్ చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు మృతిచెందారు. ముగ్గురు అన్నదమ్ములు ఉండగా నవీన్‌కు ఇంకా వివాహం కాలేదు. అయితే ఆత్మహత్యకు పాల్పడడం వెనుక కారణాలు తెలియరాలేదు.


సౌత్‌జోన్ కరాటే పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్లు



ఎంపికైన క్రీడాకారులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: ఎల్ఎన్‌సీటీ భోపాల్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కరాటే టోర్నమెంట్‌లో పాల్గొనే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) స్త్రీ, పురుషుల జట్ల వివరాలను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల యూనివర్సిటీ అనుబంధ కళాశాల రఘు ఇంజినీరింగ్ కాలేజ్, విశాఖ కళాశాల క్రీడామైదానంలో జరిగిన అంతర యూనివర్సిటీ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు ప్రతిభ చూపడంతో వారంతా జట్లకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



దగ్ధమైన ట్రాక్టర్

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి పొలాల నుంచి ట్రాక్టర్‌తో వరి గడ్డి తీసుకొస్తుండగా బుధవారం సాయంత్రం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు అప్పికొండ కృష్ణ తన పశువుల మేత కోసం పొలాల నుంచి ట్రాక్టర్‌పై గడ్డి తీసుకువస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి అదుపుచేశారు. అనంతరం బాడంగి అగ్ని మాపక సిబ్బంది వచ్చిన మంటలను ఆర్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹85	₹140	₹150

హరిలో రంగ హరి..!

- గ్రామాల్లో మొదలైన హరిదాసుల సందడి
- సంతరించుకున్న సంక్రాంతి శోభ
- దశాబ్దాలుగా అక్షయపాత్ర వినియోగం



కురుపాం: తలపై అక్షయ పాత్ర, మెడలో నిలువెత్తు దండ..పట్టు పీతాంబరాలు, ఒక చేతిలో చిడతలు..మరోచేతిలో తంబుర..నుదుటన నామాలు..కాళ్లకు గజ్జెలు..కంచుకంఠంతో విష్ణు నామస్మరణ..నెల రోజుల పాటు పల్లె ముంగిట హరిదాసులు దర్శనమిస్తే సంక్రాంతి పండగ ఆరంభమైనట్లే. పల్లెల్లో తెలతెలవారక ముందే హరిలో రంగ హరి..! అంటూ హరిదాసుల సంకీర్తన ప్రారంభం కావడంతో సంక్రాంతి పండగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండగ రోజుల్లో పల్లెల్లో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. సంక్రాంతి పండగ ఆగమనాన్ని గుర్తుచేస్తూ హరిదాసులు నెల రోజుల పాటు వచ్చి హరి నామస్మరణ చేస్తూ ప్రతి ఇంటికి వెళ్తారు. కానీ ఎవరి ముంగిట ఎక్కువసేపు నిలవరు. కానుకలు సమర్పించినా సమర్పించకపోయినా హరి నామస్మరణతో ముందుకు సాగిపోతారు. తెల్లవాకుజామున ప్రారంభమయ్యే వారి ప్రయాణం సూర్యుడు నడినెత్తికి వచ్చే వరకూ సాగుతుంది. ఈ సందర్భంగా సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా..అంటూ భద్రాద్రి రామదాసు కీర్తనలు రాగయుక్తంగా ఆలపిస్తారు.

అక్షయ పాత్ర చాలా ప్రధానం

హరిదాసుల నెత్తిపై ఉండే అక్షయ పాత్ర చాలా ముఖ్యమైంది. తెల్లవారుజామున పాత్రను తలపై ధరించిన తరువాత గ్రామ సంచారం పూర్తయ్యేవరకు కిందికి దించబోమని సంవత్సరాలుగా హరిదాసు వృత్తిలో ఉన్నవారు చెబుతున్నారు. ధనుస్సంక్రమణంలో హరిదాసుల అక్షయపాత్రకు ఎంతో ఘనచరిత్ర ఉంది. శ్రీమహావిష్ణువు సూర్య భగవానుడికి అందించిన అక్షయపాత్రకు వనవాస సమయంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఇచ్చాడని పురాణాల్లో పేర్కొన్నారు.

ధర్మరాజు సందేహం నివృత్తి

ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం ఈ పాత్ర విషయంలో ధర్మరాజు ధర్మ సందేహాన్ని శ్రీకృష్ణుడు నివృత్తి చేస్తూ సలహా చెప్పాడు. ఒక మంటపానికి వేయి గంటలు కట్టించి, విప్రోత్తములందరినీ పిలిచి అన్న సమారాధన చేయాలని, ఆ సమయంలో ఏకకాలంలో వేయి గంటలు మోగాలని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు. పై విధంగా చెప్పినప్పటికీ గంటలు మోగకపోవడంతో కృష్ణుడిని పాండవులు ప్రార్థించారు. కృష్ణుడు శ్రీవైష్ణవుని పిలిచి భోజనం చేయమని అర్థించగా స్వయంపాకం కోరాడని, స్వయంగా వండివార్చి, గోదాదేవి సహిత శ్రీకృష్ణ మూర్తికి అర్పణ చేసిన తరువాత వైష్ణవుడు భుజించగా ఆ వేయి గంటలు మోగినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. దీంతో ధర్మరాజు అక్షయ పాత్రను వైష్ణవుడికి ఇవ్వగా అప్పటి నుంచి ఆ పాత్రను ధనుర్మాసంలో తలపై ధరించి విష్ణునామ సంకీర్తనలతో గ్రామ సంచారం చేసే వృత్తిగా సంక్రమించిందని హరిదాసు పిరిడి సింహాచం తెలిపారు. ధనుర్మాసం నెల రోజులూ సూర్యోదయానికి ముందు శ్రీకృష్ణ, గోదాదేవిలకు నివేదన చేసి, తిరుప్పావైపఠించి అక్షయ పాత్రను ధరిస్తామన్నారు. పాత్ర ధరించి గ్రామ సంచారం ప్రారంభమైన దగ్గర నుంచి అక్షయ పాత్ర దించడం కానీ, మాట్లాడడం కానీ చేయరాదని చెప్పారు. ఆధ్యాత్మిక, రామాయణ కీర్తనలు, కృష్ణలీలలను గానం చేస్తూ సంక్రాంతి శోభ పల్లెలకు విస్తరిస్తామని తెలిపారు.

ఈ నెల 12 వరకు క్లెయిమ్‌ల పరిష్కారం



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 12తేదీ వరకు పరిష్కరించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ అర్.గోవింద రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాపై 2024 జనవరి 12వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. తుదిజాబితాను 22వ తేదీన ప్రచురించనున్నామన్నారు. 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అన్ని మండల కేంద్రాల్లో అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,86,354 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,79,811 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్‌లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్-డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొబైల్ వ్యాన్ షెడ్యూల్ ముందుగా తెలియజేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు తామరకండి వెంకటరమణ, వి.శ్రీనివాసరావు, ఎస్.ఉమామేశ్వరరావు, పి.రవికుమార్, పైల శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ డి.రవికుమార్, తదితరులు, పాల్గొన్నారు.

2055 రేషన్‌కార్డులు మంజూరు

జిల్లాలో రైస్‌కార్డులు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 2055 మందికి కొత్త కార్డులు మంజూరైనట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కార్డులు మంజూరైన లబ్ధిదారులు వారి పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో కార్డులు పొందాలని సూచించారు. అలాగే రేషన్ పంపిణీ వాహనాలవద్ద జనవరి నెలకు సంబంధించి బియ్యం తీసుకోవాలని చెప్పారు.

బొబ్బిలి సీటు బీసీలకు ఇచ్చే దమ్ముందా?

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: బీసీ సామాజికవర్గం తన ఆత్మీయులని ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు నాయుడికి బొబ్బిలి ఎమ్మెల్యే సీటును బీసీలకు కేటాయించే దమ్ము, ధైర్యం ఉందా? అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశ్నించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీల మీద అంతప్రేమ ఉన్న వ్యక్తి బొబ్బిలిలో రాజులకెందుకు పెత్తనం అప్పగిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులు, మహిళలకు ఏదేదో చేస్తానని వాగ్దానాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పద్నాలుగేళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు దిగజారుడుతనంతో మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఓట్లతో గెలిచి, టీడీపీలోకి వచ్చి మంత్రి పదవి పొంది నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా అవినీతి, కబ్జాలకు పాల్పడిన వారిని పక్కనే పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలపై చంద్రబాబు నోరుపారేసుకోవడం విచారకరమన్నారు.

పేదల పక్షాన జగన్

తెలుగుదేశం, దాని తోక పార్టీలు ఎన్ని అబద్ధాలు ఆడినా, ఎన్ని ఆరోపణలు చేసినా వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరని, అది బొబ్బిలితోనే ఆరంభమవుతుందన్నారు. రాష్ట్రంలో పెత్తందారులు, పేదల మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలం నాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, మండల యూత్ ప్రెసిడెంట్ పత్తిగుళ్ల ఏక్‌నాథ్, మండల ఉపాధ్యక్షుడు డబ్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిల్స్ పంపిణీ



ట్రైసైకిల్స్ అందజేస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిల్స్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు బుధవారం పంపిణీ చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ట్రైసైకిల్స్ మంజూరుచేయాలని పలువురు దివ్యాంగులు అర్జీలను పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం పదమాయవలస గ్రామానికి చెందిన చింతాడ రాములు, జియ్యమ్మవలస మండలం జోగులడుమ్మ గ్రామానికి చెందిన పాండ్రంగి శంకరరావులకు ట్రైసైకిల్స్ అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సంక్షేమ అధికారి పి.వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

బంగారం కొట్టేశారు..పోలీసులు పట్టేశారు!

- సపర్యలు చేసినట్టు నటిస్తూ బంగారంతో ఉడాయించిన యువకులు
- రెండు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు



కర్రి అమ్మన్న

హిరమండలం: మండల కేంద్రం హిరమండలంలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. అపస్మారక స్థితిలో పడిపోయిన మహిళను రక్షిస్తున్నట్టు నటించి ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను ఇద్దరు యువకులు తెంచుకుపోయారు. సీసీ పుటేజీలకు చిక్కడంతో పోలీసులు నిందితులను రెండు గంటల్లోనే పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భామిని మండలం నులకజోడుకు చెందిన కర్రి అమ్మన్న పాతపట్నం మండలం కొరసవాడ వెళ్లింది. అక్కడ కుమార్తెను పండుగ పిలుపు చేసుకొని తిరుగుముఖం పట్టింది. సుభలయి బ్యారేజీ సెంటర్‌కు చేరుకుని పక్కనే బహిర్భూమికి వెళ్లింది. అనారోగ్యానికి గురై అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పుడే ఇద్దరు యువకులు ఆమెకు సపర్యలు చేస్తున్నట్టు నటించి మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. కొద్దిసేపటికే మెలకువ రావడంతో అమ్మన్న ఒక్కసారిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు ఆరాతీశారు. తన ఆభరణాలు దోచుకుపోయారంటూ లబోదిబోమంటూ వెంటనే హిరమండలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. కేసు నమోదుచేసిన పోలీసులు సుబలాయి జంక్షన్‌లో సీసీ పుటేజీలను పరిశీలించి మోణంగి వీధికి చెందిన ఐ.సురేష్, సిహెచ్.మాధవరావులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించగా బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు 15 ఏళ్ల జైలు



గంజాయి కేసులో ముద్దాయిలు

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 15 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ ఒకటవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.రజని బుధవారం తీర్పు వెల్లడించినట్లు రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం రూరల్ పరిధిలో రాకోడు- పినవేమలి గ్రామాల మధ్య 2018 ఫిబ్రవరి 19న అప్పటి రూరల్ ఎస్సై పి.రామకృష్ణ వాహన తనిఖీలు చేపట్టగా, గంట్యాడ మండలం నరవ గ్రామంలోని ఏఎంజీ.కాలనీకి చెందిన చలుమూరి గంగునాయుడు, విజయనగరం పట్టణానికి చెందిన పెసల శ్యాంసన్‌లు వేర్వేరు మోటార్ సైకిల్స్‌పై నరవ నుంచి వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వారి నుంచి 65 కిలోల గంజాయిని అప్పటి తహసీల్దార్ సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్పటి రూరల్ సీఐ డి.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించి, అభియోగపత్రం దాఖలు చేశారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో ప్రస్తుత రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు ఈ కేసును ప్రాధాన్య జాబితాలో స్వీకరించి, కోర్టు విచారణలో సాక్షులను ప్రవేశపెట్టి ప్రత్యేక శ్రద్ధ వహించడంతో నిందితులపై నేరారోపణలు రుజువయ్యాయి. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రవి పోలీసుల తరఫున వాదనలు వినిపించారు.

సారా బట్టీలపై విస్తృత తనిఖీలు

- 10 లీటర్ల సారా, ఒక బైక్ స్వాధీనం
- 700 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



కొత్తవలస: చిన్నమన్నిపాలెం సమీపంలో సారా తరలిస్తుండగా పట్టుబండిన బైక్,10 లీటర్ల సారాతో సీఐ రాజేశ్వరి తదితరులు



కొత్తవలస: రామలింగాపురం సమీపంలో బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

కొత్తవలస: కొత్తవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ సీహెచ్.రాజేశ్వరి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సారా తయారీ, అమ్మకాలపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు మండలంలోని చిన్నమన్నిపాలెం జంక్షన్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో అదే గ్రామానికి చెందిన బొబ్బాది ముత్యాలు ద్విచక్రవాహనంపై 10 లీటర్ల సారాతో, వేపాడ మండలం బొద్దాం గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో గల్లా రమణ లీటర్ సారాతో పట్టుబడినట్లు సీఐ రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు నిందుతులిద్దరినీ కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. అలాగే చిన్నమన్నిపాలెం, రామలింగాపురం గ్రామ సమీపాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించగా పోలీసుల అలికిడి తమనించి తయారీదారులు పరారయ్యారని, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లం ఊట సుమారు 700 లీటర్లను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పి.నరేంద్రకుమార్, సిబ్బంది సీహెచ్.సంతోష్‌కుమార్, జి.మనోజ్, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న సారా, బెల్లంఊటలను చూపిస్తున్న ఎస్సై వెంకటరమణ, సిబ్బంది

460 లీటర్ల సారా ధ్వంసం

సాలూరు: మండలంలోని కోడంగివలస శివారు అటవీప్రాంతంలో అక్రమంగా తయారుచేస్తున్న సారా స్థావరాన్ని గుర్తించి 460 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి కోడంగివలస సమీపంలో సారా స్థావరంపై దాడిచేశామన్నారు. అక్కడ సారాతో పాటు సారా తయారీకి ఉపయోగించే సుమారు 3వేల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న చేరికలు

- సీతానగరంలో 100 కుటుంబాల వారికి పార్టీ తీర్థం



సీతానగరం: మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు పార్టీలో చేరినవారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: జగనన్న ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన ఇతర పార్టీలకు చెందిన వారంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని రామవరంలో మాజీసర్పంచ్ పెంట శ్రీనివాసరావుతో సహా 100 కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీకండువాలు వేసిన ఎమ్మెల్యే జోగారావు వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావును గ్రామస్తులు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ, బీసీ కాలనీల ప్రజల కోరిక మేరకు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం నిర్దేశించిన గడువులోగా పూర్తికావడంతో ఎమ్మెల్యే ప్రారంభించారు. పార్టీలో చేరికలనంతరం ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గతప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించడంతో గ్రామాల్లో 5 సంవత్సరాలుగా పేరుకుపోయిన ప్రజా సమస్యలను జగనన్న ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో శరవేగంగా పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మాజీసర్పంచ్ శ్రీనివాసరావుతో పాటు గణపతిరావు, త్రినాథ, సత్యనారాయణ, కృష్ణమూర్తి, దాలినాయుడు, కె.శివుడు, ఆర్ సత్యనారాయణ, ఈశ్వరరావు, దాసులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీ కండువాలు వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వై.గోపాలనాయుడు, పి. ఈశ్వరనారాయణ, పెంట శ్రీనివాసరావు, పి.సూర్యనారాయణ, పి. రామకృష్ణ, గుల్ల శంకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలో వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపర పెరుగుతోంది. ఈ మేరకు బుధవారం బెలగాం ప్రాంతంలోని 16 వవార్డుకు చెందిన 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దత్తి పద్మావతి, దత్తి సోంబాబు, గుణుపూరు జగదీష్, గుణుపూరు నర్సింగ్, దత్తి తాతబాబు, డి. నాయుడుబాబులతో పాటు వారి కుటుంబాలను ఎమ్మెల్యే జోగారావు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

వెంకంపేటలో..

పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన 25 టీడీపీ కుటుంబాల వారు స్థానిక పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: 16వ వార్డుకు చెందిన వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



వెంకంపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం



తనిఖీలు నిర్వహిస్తున్న మైన్స్ ఎ.డి మల్లేశ్వరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: అక్రమంగా మైనింగ్ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని మైన్స్ ఎ.డి (విజిలెన్స్) ఎస్పీకే మల్లేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస గ్రామానికి చెందిన పెందుర్తి శ్రీను సర్వేనంబర్ 116లో అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందగా బుధవారం ఆ ప్రాంతంలో తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో విచారణ చేసి అక్రమ మైనింగ్ జరగకుండా చూసుకోవాలని వీఆర్‌ఓలకు ఆదేశాలు జారీచేశామని వివరించారు. తనిఖీల్లో ఆయనతో పాటు రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బండారు శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ కె.పైడితల్లినాయుడు పాల్గొన్నారు.